
ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY

ఖమ్మం
ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 35 । కనిష్ఠం 23 | భద్రాద్రి : గరిష్ఠం 36 । కనిష్ఠం 25 గురువారం, 8 ఫిబ్రవరి 2024 5

విద్యుత్ శాఖలో అలజడి

- అక్రమంగా ఉద్యోగి నియామకం, జీతాల చెల్లింపుపై విచారణ
- ఖమ్మం ఎస్ఈ కార్యాలయానికి ఆడిట్ సీజీఎం రాక
- విచారణకు హాజరైన నాటి డీఈలు, ఏడీఈలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పోస్టుమార్టం

7

భద్రాద్రికి నవ్య శోభ

- వెండి వాకిలితో అంతరాలయ ప్రవేశ ద్వారం సిద్ధం


అంతరాలయ ప్రవేశ ద్వారంలో వెండి వాకిలి సిద్ధం

భద్రాచలం, ఫిబ్రవరి 7: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామాలయంలో ముచ్చటైన మూడు వాకిళ్ల ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభానికి ముందు పక్క ముఖ మండప ద్వారం ఇత్తడి తాపడంతో వెలుగొందుండగా గర్భాలయ ద్వారం స్వర్ణ కాంతులను వెదజల్లుతోంది. తాజాగా రామాలయంలో అంతరాలయ ప్రవేశ ద్వారం వెండి వాకిలితో సిద్ధమైంది. ఇలా మూడు లోహాల వాకిళ్లతో భద్రాద్రి రామాలయం నవ్యశోభను సంతరించుకుంది. 2022లో 103కేజీల వెండితో ఇందుకు సంబంధించిన పనులను చేపట్టారు. ఇందులో సుమారు 70 కిలోలు దేవస్థానానికి చెందిన వెండిని వినియోగించగా, మిగిలిన 33కేజీల వెండిని దాతల ఆర్థిక సహకారంతో సమకూర్చారు. సిద్ధం చేసిన వెండి ద్వారం రేకులను గత నెల 29నుంచి ఆలయ ప్రాంగణంలోని అంతరాలయ ప్రవేశద్వారానికి ఏర్పాటు చేసే పనులు చేపట్టారు.

ఇదిలా ఉండగా ఇప్పటికే అంతరాలయంలో ప్రధాన ద్వారానికి స్వర్ణ వాకిలిని రూ.40లక్షలతో ఇండియా సిమెంట్స్ ఎండీ, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్ తయారు చేయించారు. అలాగే ముఖ మండప ద్వారంలో ఇత్తడి తాపడం ఏర్పాటుకు రూ.15 లక్షల వరకు వెచ్చించారు. తాజాగా 103 కేజీలకు పైగా వెండితో అంతరాలయ ప్రవేశ ద్వారం వెండి తాపడంతో అలంకరించారు. ద్వారంపై 'శ్రీరామ జయ రామ జయ జయ రామ' అని సువర్ణ అక్షరాలతో లిఖించారు. అలాగే దశావతారాలు, భక్తరామదాసు, పోకల దమ్మక్క భద్రాద్రి రామయ్యను పూజిస్తున్నట్లు చిత్రాన్ని కూడా ఏర్పాటు చేశారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఓటు గడువు


ఉమ్మడి జిల్లా నుంచి 1,24,353 మంది పట్టభద్రుల దరఖాస్తు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదుకు దరఖాస్తు గడువు ముగిసింది. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ ఏర్పడగా ఉప ఎన్నిక నిర్వహించడం కోసం పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలని ప్రభుత్వ సూచించింది. ఈ ఎన్నిక నిర్వహణకు ఎలక్టోరల్ తయారీకి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షెడ్యూల్



విడుదల చేయగా ఫిబ్రవరి 6 వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఫిబ్రవరి 24న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రచురణ, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ, మార్చి 29 వరకు అభ్యంతరాల పరిష్కార తర్వాత, ఏప్రిల్ 4న తుది జాబితాను ప్రకటించనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 1,24,353 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు.

గతంలో జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 85,051 మంది ఓటరుగా నమోదుకాగా ప్రస్తుతం 83,933 దరఖాస్తులు మాత్రమే అందాయి. వీటిలో 80,356 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందగా వాటిపై ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో బీఎల్వోలతో విచారణ చేయిస్తున్నారు. గతంతో పోల్చితే సుమారు 2వేల మంది ఈసారి ఓటు నమోదు చేసుకోలేదు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 40,420 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ ప్రియాంక తెలిపారు. వీటిలో 39,991 ఆన్‌లైన్ ద్వారా, 429 ఆఫ్‌లైన్ ద్వారా వచ్చినట్లు తెలిపారు.



పట్టుభట్టి

- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క
- ఉమ్మడి జిల్లాకు తొలిసారి దక్కిన గౌరవం
- భట్టి నిధుల కేటాయింపులపై భిన్న వర్గాల్లో ఆశలు
- వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు మోక్షం కలుగుతుందని ధీమా



నిధులిస్తారా!?

ఖమ్మం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం నుండి ప్రారంభం కాబోతున్నాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లభించబోతుంది. జిల్లానుండి ఇప్పటివరకు ఆర్థికశాఖ మంత్రిగా ఎవరూ పనిచేయలేదు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో జిల్లా నుంచి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు మంత్రి పదవులు లభించగా, భట్టి విక్కమార్కకు ఉపముఖ్యమంత్రితో పాటు ఆర్థిక,విద్యుత్, ఇంధన శాఖలు దక్కాయి. దీంతో ఈనెల 10న భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.. భట్టి బడ్జెట్ కేటాయింపులో ఉమ్మడి జిల్లాకు నిధుల కేటాయింపు మెరుగ్గా ఉంటుందని భిన్న వర్గాల వారు ఆశిస్తున్నారు.

సీతారామపై ఆశలు

ఉమ్మడి జిల్లాలో సీతారామ సాగునీటి ప్రాజెక్ట్‌కు రూ.7500 కోట్లు, సీతమ్మసాగర్‌కు రూ.1500 కోట్ల నిధులు అవసరముంది. ఈ ఏడాది పనులు జరగాలంటే కనీసం రూ.3వేల కోట్లునిధులు అవసరం. బడ్జెట్‌లో సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులతో పాటు పాలేరు,వైరా, లంకాసాగర్, బేతుపల్లి, తాలిపేరు, కిన్నెరసాని,జాలిమూడి ప్రాజెక్టుల మరమ్మతు, కాలువల ఆధునీకరణ పనులకు నిధుల అవసరం ఉంది. నిధులు కేటాయిస్తేనే వచ్చే సీజన్‌కు పనులు పూర్తి అవుతాయి. ఎన్నెస్పీ కాలువల ఆధునీకరణకు కూడా నిధులు అవసరం. అలాగే మున్నేరు. గోదావరి వరదల నివారణకు కరకట్టల పనులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగాల్సిఉంది.

విద్యాపరంగా...

జిల్లాలో ఖమ్మం మెడికల్ కాలేజీకి శాశ్వత భవనాల నిర్మాణాలకు రూ.100 కోట్లకు పైగా నిధులు అవసరం. బడ్జెట్‌లో కేటాయిస్తే మెడికల్ కాలేజీకి సొంతభవనాల నిర్మాణాలు మొదలవుతాయి. అలాగే కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉంది. అక్కడ పనులు పూర్తికావాలంటే నిధుల అవసరం ఉంది. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో గత విద్యాసంవత్సరం జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. స్థలం గుర్తించినా కేటాయింపు జరగలేదు. అలాగే భవనాలు, ల్యాబ్‌లు పూర్తి కావడానికి సుమారు రూ.250 కోట్లకు పైగా నిధులు అవనరం ఉంది. నిధులు కేటాయిస్తేనే వచ్చే విద్యాసంవత్సరానికి తరగతులు ప్రారంభం అవుతాయి.

ఆలయాల అభివృద్ధికి....

ఉమ్మడి జిల్లాలో భద్రాచలం సీతారామ పుణ్యక్షేత్రం, జమలాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయం అటు దక్షిణ అయోధ్య, ఇటు తెలంగాణా తిరుపతిలా రెండు క్షేత్రాలు ఉన్నా గత ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. వీటితో పాటు పురాతన శివాలయాలు, పుణ్యక్షేత్రాలకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అలాగే పాలేరునుండి పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నా నిదుల కేటాయిపు జరగటం లేదు. ఈ సారి బడ్జెట్‌లో అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

రహదారులు, బ్రిడ్జిలు...

జిల్లాలో ఆర్ అండ్ బీ, పంచాయితీరాజ్, మునిసిపల్ శాఖలకు సంబంధించి రహదారులు, బ్రిడ్జిలునిధుల కోసం ఎదరుచూస్తున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఇతర మునిసిపాలిటీల్లో రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధికి నిధుల అవసరం ఉంది. మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. అలాగే ఖమ్మం నుండి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లే రహదారులు, బ్రిడ్జిల మరమ్మతులు, కొత్తరోడ్ల నిర్మాణం, గ్రామీణ రహదారులకు కూడా నిధుల అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఆర్ అండ్ బీ, పంచాయితీరాజ్, ఐటీడీఏ ద్వారా సుమారు రూ.1500 కోట్ల మేర ప్రతిపాదనలు ఉన్నాయి. జిల్లాలో పబ్లిక్‌హెల్త్, అగ్రికల్చర్, విద్యుత్, పరిశ్రలతో పాటు పలు శాఖల పరిధిలోని పనుల నిర్వహణ, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు, సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి పథకం పనులకు బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది. ఈ సారి బడ్జెట్‌లో ఎమ్మెల్యేలు తమ ప్రాంత అభివృద్ధికి చొరవ చూపితేనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కొంత ఊరట లభించనుంది.

అభివృద్ధి పనుల్లో అలసత్వం సహించను


అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

- మహాశివరాత్రి నాటికి వైరా నది ఒడ్డున స్నాన ఘట్టాలు
- వైరాలో ఇంటర్నేషనల్ స్థాయి విద్యాలయానికి స్థల సేకరణ చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వైరా మండలంలో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

7

తీర్థాల జాతరకు విస్తృత ఏర్పాట్లు


తీర్థాలలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

- భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- ఆలయ భూముల పరిరక్షణకు అన్ని చర్యలు చేపట్టాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

6


ఖమ్మం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

మెరిసిన ఎర్ర బంగారం

- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.22,300 జెండాపాట
- ఒక్కరోజే రికార్డుస్థాయిలో 75వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 7: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజ మిర్చికి డిమాండ్ పెరుగుతోంది. మార్కెట్‌లో బుధవారం తేజ మిర్చికి రూ.22,300 జెండాపాట నిర్ణయించగా నాణ్యతను బట్టి కనిష్ఠంగా క్వింటాలు రూ.14 వేలకు, నమూనా రకాలను గరిష్ఠంగా క్వింటాలుకు రూ.21 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు.

మార్కెట్‌లో మిర్చికి కొంత కాలంగా క్వింటాలుకు రూ.20 వేల నుంచి రూ.21,500 వరకు ధర లభిస్తోంది. ఈ క్రమంలో రెండు, మూడు రోజుల్లోనే వ్యాపారులు క్వింటాలుకు రూ.800నుంచి రూ.1,000 అదనంగా ధర పెట్టి కొనుగోలు చేయడం విశేషం. మార్కెట్‌లో కొత్త మిర్చికి అత్యధిక ధరలు లభించడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి. ఈ సంవత్సరం తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గడంతో క్వింటాలుకు రూ.25 వేలకు తగ్గకుండా ధర ఉంటేనే గిట్టుబాటవుతుందని రైతులు చెబుతున్నారు.

ఖమ్మం మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలనుంచి మిర్చి అమ్మకానికి వస్తోంది. తేజ రకం డీలక్స్ క్వాలిటీ మిర్చికి ప్రధానంగా చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలలో డిమాండ్ ఉంటుంది. ఆయా దేశాలకు ఎగుమతులు ఎక్కువగా ఉంటే మిర్చి ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

మిర్చి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని రైతులు కోల్డ్‌స్టోరేజీలో తమ పంటను నిల్వ చేసేందుకు వెనుకాడుతున్నారు. తమ వ్యవసాయ క్షేత్రంలో సేకరించి, గ్రేడింగ్ చేసిన పంటను వెంటనే అమ్మకానికి మొగ్గు చూపుతున్నారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్-2 సెక్రెటరీ బజారు తదితరులు సమీక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఖమ్మం మార్కెట్‌కు సుమారు 75వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైన తరువాత తొలిసారిగా పంట మార్కెట్‌కు ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం.

డయల్ 100కు 3463 కాల్స్

నగర పోలీసు కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం క్రైం, ఫిబ్రవరి7: సమాజంలో పెరుగుతున్న నేర ప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటైన డయల్ 100కు జనవరి నెలలో 3,463 కాల్స్ వచ్చాయని నగర పోలీసు కమిషనర్ సునిల్‌దత్ బుధవారం తెలిపారు. వాటిపై విచారణ జరిపి 109 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. వీటిలో హత్యాయత్నం 1, మహిళలపై వేధింపులు7, దొంగతనాలు 8, యాక్సిడెంట్లు 26, సాధారణ నేరాలు 36, ఇతర కేసులు 31 అని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పౌరులు 100కు డయల్ చేసి తెలుపాలని కమిషనర్ కోరారు.



నగరంలో సమ్మక్క, సారక్క కోలాహలం

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 7: సమ్మక్క, సారక్క మినీ జాతర ఖమ్మం నగరంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక కాల్వొడ్డులోని రేణుక ఎల్లమ్మ ఆలయం ఇందుకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, డీజే పాటలు, నృత్యాలతో శివశక్తుల ర్యాలీ, ప్రత్యేక పూజలు , విన్యాసాలు నిర్వహించారు. అనంతరం ఆనవాయితీ మేరకు సమ్మక్క, సారక్కలను గద్దెలమీద ప్రతిష్ఠించారు. మహిళాభక్తులు బోనాలు ధరించి హాజరయ్యారు. జాతరలో రెండవ రోజు గురువారం నాడు ప్రత్యేక పూజలు ఒడి బియ్యం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయి.

యాసంగి పంటలను కాపాడాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

- ముగ్గురు మంత్రులదే ఆ బాధ్యత
- పంటలు పూర్తయ్యేవరకు పాలేరు పాతకాలవకు నీరివ్వాల్సిందే
- ప్రజాసమస్యలపై పోరాటాలు కొనసాగిస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలేరు పాతకాల్వ ఆయకట్టుతో పాటు జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగుచేస్తున్న పంటలకు నీరందించి కాపాడే బాధ్యత ముగ్గురు మంత్రులదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఎక్కడైనా పంటలకు నీరులేక ఎండిపోతే రైతుల పక్షాన సీపీఎం పోరాటం చేస్తుందని తెలిపారు. పాలేరు పాతకాల్వకు నీరు విడుదల చేయనందునే అఖిలపక్ష రైతులు బలవంతంగా నీరు విడుదల చేశారని గుర్తుచేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం పక్షాన దశలవారీగా పోరాటాలు చేస్తామని ప్రకటించారు.

తన ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత బుధవారం తొలిసారి ఖమ్మం వచ్చిన తమ్మినేని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాలేరు పాతకాల్వ కింద 14,500 ఎకరాల్లో వరి, చెరుకు పంటలు సాగవుతున్నాయని, ఇందుకు జిల్లా మంత్రులు బాధ్యత తీసుకొని నీరివ్వాలన్నారు. రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగుప్రజలు సోదరభావంతో మెలగాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణానదీజలాల సమస్యతో తెలుగు ప్రజల మధ్య విబేధాలు సృష్టించడం తగదన్నారు.

కృష్ణా రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ప్రాజెక్టులను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. దీనిపై బీఆర్ఎస్ రాజకీయ సభ పెట్టి తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిలించే ప్రయత్నం చేయడం తగదన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ కూడా పోటీసభ పెట్టాలనుకోవడం సరికాదన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో వివాదాలు లేకుండా కేంద్రం చూడాలన్నారు. ఆరునెలల్లో కాంగ్రెస్‌ప్రభుత్వం కూలుతుందని బీఆర్ఎస్ నేతలు శాపనార్థాలు పెట్టడం, పెళ్లయిన వెంటనే చావుమంత్రాలు చదివినట్టు బీఆర్ఎస్ నేతల వ్యవహారం ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేయాలని తెలిపారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కేసీఆర్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పు అని, అది కేసీఆర్ ఓటమే తప్ప కాంగ్రెస్ విజయం కాదన్నారు.

కేంద్రం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా 16న నిర్వహించే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ విషయంపై త్వరలో రాష్ట్రకమిటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సీపీఎం జాతీయనాయకులు సాయిబాబా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, యర్రాశ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడారం మార్గానికి నిధుల కేటాయింపు

- తాత్కాలిక రోడ్డు పనులకు రూ.5.60 లక్షలు కేటాయింపు
- పినపాక ఎమ్మెల్యే పాయం, ప్రజాప్రతినిధుల దృష్టి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 7: మేడారం వేళ్లే మార్గానికి నిధులు మంజూరయ్యాయి. ఆళ్లపల్లి మండలంలో మర్కోడు నుంచి కరకగూడెం మండలంలోని రేగళ్ల మార్గం ద్వారా మేడారం వేళ్లేందుకు దగ్గర అయినపట్టికి మార్గ మధ్యలోని 14 కిలోమీటర్లు గుట్టలు, రాళ్లు, ఒర్రెలు, ఉండటంతో మేడారం వేళ్లే భక్తులతో పాటు సాధారణ ప్రయాణికులు, పట్టణ ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ మార్గం ద్వారా రావడంతో దారిలేక చుట్టుతిరిగి అదనంగా ప్రయాణిస్తు అనేక ఇబ్బందులు పడేవారి అయితే 14 కిలోమీటర్లు దారికి తాత్కాలికంగానైనా మరమ్మత్తులు చేస్తే మేడారం వేళ్లే భక్తులతోపాటు, సాధారణ ప్రయాణికుల కష్టాలు తొలగిపోతాయిని జనవరి 19న 'ఆంధ్రజ్యోతి'లో 'మేడారం మార్గానికి నిధులేవి..? అనే శీర్షిక ద్వారా మర్కోడు- రేగళ్ల రోడ్డు లేక పడుతున్న ఇబ్బందులపై కథనం ప్రచురించింది. దాంతో స్పందించిన ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ మండల నాయకులు దృష్టిపెట్టి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమస్యను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మంత్రి పొంగులేటికి వివరించారు. దాంతో ఎమ్మెల్యే పాయం కృషి చేయడంతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.5.60 లక్షల నిధులు కేటాయించారు. దాంతో ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించగా, రెండు రోజులుగా మర్కోడు- రేగళ్ల రోడ్డు మరమ్మతుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మంలో గంజాయి మూలాలను పెకిలిస్తున్న ఎక్సైజ్‌శాఖ

- ఐదుగురు ప్రధాన నిందితుల రిమాండ్
- మంత్రి తుమ్మల ఆదేశంతో ఎక్సైజ్‌శాఖ దూకుడు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి7: గతంలో కళ్ల ఎదుట గంజాయి అమ్మకాలు జరిపినా ఎక్సైజ్‌శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకునే పరిస్థితి ఉండేదికాదు. ఏ యువకుడిని గంజాయి కేసులో అరెస్ట్ చేస్తే ఏ ప్రజాప్రతి నిధి బెదిరిస్తారో అనే ఆలోచన ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఉండేది. అయితే తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్య తలు తీసుకున్ననాటి నుంచి జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారు లకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. గంజాయిపై ఉక్కు పాదంమోపాలని ఎక్సైజ్‌శాఖ అధికారులకు మంత్రి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దీంతో వారం రోజులుగా ఖమ్మంలోని గంజాయి ముఠాపై ఎక్సైజ్‌శాఖ లాఠీ ఝులిపిస్తున్నారు. స్థానికంగా గంజాయి ముఠా గుట్టును రట్టు చేస్తూ మూలాలను పెకిలిస్తున్నారు. ఇప్పటికే నలుగురు ప్రధాన గంజాయి వ్యాపారం చేసే వారిని జైలుకు పంపిన అధికా రులు మరో ఐదుగురిని రిమాండ్ చేశారు. ఖమ్మంలో గంజాయి వ్యాపారం చేస్తూ యువతకు గంజాయి మత్తు ఎక్కిస్తున్న గంజాయి ముఠాను ఖమ్మం వన్‌టౌన్ సీఐ రాజు ఆధ్వర్యంలో పట్టుకొని నిందితులను బుధవారం రిమాండ్‌కు పంపారు. సీఐ రాజు తెలిపిన వివరాల మేరకు. ఖమ్మంనగరంలోని టేకులపల్లికి చెందిన ఉల్లి శరత్, ముస్తఫానగర్‌కు చెందిన సయ్యద్ ఫాయాజ్ అహ్మద్, కొదుమూరు నాగరాజు అలియాస్ రాజురవాణ్, బుర్హన్‌పురానికి చెందిన షేక్ సోహేల్ అర్బత్, శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్ సాధిక్‌పాషా అలియాస్ చోటు గంజాయి ముఠాగా ఏర్పాడ్డారు. ఈ ముఠా సభ్యులు ఏపీలోని చింతూరు అటవీ ప్రాంతానికి వెళ్లి కేజీ గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేస్తారు. ఆలా తీసుకొచ్చిన గంజాయిని 50 గ్రాములు, 10 గ్రామలు పొట్లాలుగా కట్టలు తయారు చేస్తారు. ఖమ్మంలోని ఇంజనీరింగ్ కళాశాలలు, రద్దీ ప్రాంతాలు, బైపాస్ రోడ్డు, ఖమ్మం చుట్టు పక్కల ప్రాంతాల్లోని కొందరు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా యువతకు కాలేజీ విద్యార్థులకు గంజాయి పొట్లాలు సరఫరా చేస్తున్నారు. 50గ్రాముల గంజాయి పొట్లం రూ.1,000కు, 100 గ్రాముల గంజాయి పొట్లం రూ.2వేలకు అమ్మకాలు చేస్తున్నారు. పూర్తి సమాచారంతో దాడులు చేసిన సీఐ రాజు ఐదుగురు నిందితులతో పాటుగా రెండు కేజుల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ రబ్బాని, లత, రామారావు, లలిత, శశికాంత్, రమేశ్, రవి, రమ, శిరీష కమిత, నరేశ్, మారేశ్వరరావు పాల్గొన్నారు.



ఐదుగురి నిందితులు, గంజాయితో సీఐ రాజు, సిబ్బంది

ఏడు కిలోల గంజాయి పట్టివేత..

జూలూరుపాడు, ఫిబ్రవరి 7: ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన జూలూరుపాడులో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌కు చెందిన ఏలుటూరి కార్తీకేయ, బోయినపల్లి సూర్యచరణ్‌లు 7 కిలోల గంజాయి రుద్రంపూర్ నుంచి తీసుకుని హైదరాబాద్‌లో విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. ఈ క్రమంలో జూలూరుపాడులోని పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ జీవన్‌రాజు తన సిబ్బందితో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. కొత్తగూడెం నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు ఖమ్మం వైపు వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అశ్వాపురం ఫిబ్రవరి 7: అశ్వాపురం శివారు మంచికంటినగర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. మణుగూరు నుంచి అశ్వాపురం వస్తున్న కారు మార్గమధ్యలో అశ్వాపురం నుంచి మణుగూరు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న మండల పరిధిలోని మనుబోతులగూడెం గ్రామానికి చెందిన ఏనిక సారయ్య(35)తో పాటు మరో వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 ద్వారా మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న అశ్వాపురం ఎస్ఐ తిరుపతిరావు ప్రమాద వివరాలను తెలుసుకుని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సారయ్య మృతదేహం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి7: అతివేగంగా వెళ్తున్న ఓ కారు విద్యుత్ స్తంబాన్ని ఢీకొన్న సంఘటన సత్తుపల్లి మునిసిపాలిటీలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని కాకర్లపల్లికి చెందిన పాములూరి మనోజ్ తెల్లవారుజామున సిద్దారం గ్రామం నుంచి వస్తుండగా కాకర్లపల్లి రోడ్‌లోని కిడ్స్ కేర్ ఎదురుగా అదుపుతప్పి విద్యుత్ స్తంబాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోగా విద్యుత్ అధికారులు కొద్ది గంటల తర్వాత సరఫరాను పునఃరుద్దరించారు.



మట్టి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 7: అనుమతులు లేకుండా మట్టిలోడుతో మండలంలోని రేజర్ల శివారు నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న టిప్పర్‌ని బుధవారం పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించిన అనంతరం కేసు నమోదు చేసి సత్తుపల్లి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ టీ.కిరణ్ తెలిపారు.

దుబాయ్‌లో పెయింట్ వ్యాపారి గుండెపోటుతో మృతి

బూర్గంపాడు, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన పెయింట్‌షాపు వ్యాపారి దుబాయ్‌లో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంకు చెందిన ఆవుల అశోక్‌రెడ్డి(33) భద్రాచలంలో పెయింట్‌షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా గత వారం రోజుల క్రితం దుబాయ్ టూర్ వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో దుబాయ్‌లో హోటల్‌లో ఉండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్లు తెలుస్తోంది. తోటి వారు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని పేర్కొన్నారు. మృతుడికి భార్య కోటేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అశోక్‌రెడ్డి మృతితో లక్ష్మీపురంలో విషాద చాయలు అలుముకున్నాయి.



అశోక్‌రెడ్డి (ఫైల్)

విప్పలమడకలో ఏడు క్వింటాళ్ల మిర్చి చోరీ

వైరా, ఫిబ్రవరి 7: మండలంలోని విప్పలమడక గ్రామంలో కల్లంలో ఆరబోసిన ఏడు క్వింటాళ్ల మిర్చిని మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. చెరుకూరి కృష్ణారావు అనే రైతు తనకున్న నాలుగెకరాల మెట్ట భూమిలో మిర్చి పంట సాగుచేశాడు. కోసిన మిర్చిని పొలంలోని కల్లంలో ఆరబోసి టార్పాలిన్ పట్టా కప్పాడు. దాదాపు ఏడు క్వింటాళ్ల మిరపకాయలను అపహరించుకుపోయారు. వీటి విలువ రూ.లక్షన్నర వరకు ఉంటుందని అంచనా. బాధిత రైతు కృష్ణారావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఆరబోసిన పచ్చిమిర్చి ..

బూర్గంపాడు, ఫిబ్రవరి 7: రైతు తన పొలంలోని కల్లంలో ఆరబోసిన పచ్చి మిర్చిని అపహరించిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం అశ్వాపురం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కాసబోయిన వీరన్న అనే రైతు బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండిలో వ్యవసాయం చేస్తున్నాడు. తను పండించిన ఏడు క్వింటాళ్ల మిర్చిని కల్లంలో ఆరబోశాడు. మంగళవారం రాత్రి ఇంటికి వెళ్లగా ఆరబోసిన మిర్చిని దొంగిలించినట్లు తెలిపాడు. అపహరించిన మిర్చి విలువ రూ.1.40 లక్షలు ఉంటాయని బాధిత రైతు పేర్కొన్నాడు. ఈఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా

బూర్గంపాడు, ఫిబ్రవరి 7: బూర్గంపాడు మండల పరిదిలోని సారపాక ఉడ్‌యార్డ్ సమీపంలో మంగళవారం ఐటీసీ కర్మాగారానికి కర్ర లోడుతో వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంతో ట్రాక్టర్‌లోని కర్రలు జాతీయ రహదారిపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తరచుగా కర్ర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు ప్రమాదాలకు గురవుతున్న సంభందిత ఆదికారులు, ఐటీసీ యాజమాన్యం చర్యలు తీసుకోకుండా నిమ్మకుని రేత్తినట్లు వ్యవహరిస్తుందని వారి తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

కొత్తగూడెం లీగల్, ఫిబ్రవరి 7: పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జ్ (స్పెషల్ జడ్జ్ పోక్సో) ఎం.శ్యామ్‌శ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా.. ములకలపల్లి మండలం, నర్సాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక 2021 అక్టోబరు 12న తన ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్యనారాయణ అలియాస్ సత్యంబాబు బాలికకు చాక్లెట్ ఇస్తానని మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించుటకు ప్రయత్నం చేసిన ఘటనపై యువతి తల్లి ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మరునాడు ఫిర్యాదు చేసింది.

అప్పటి ఎస్‌ఐ బి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో 9 మంది సాక్షులను విచారించిన అనంతరం సత్యంబాబుపై నేరం రుజువు కాగా సత్యంబాబుకు 5 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రావి విజయ్‌కుమార్ నిర్వహించారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎం.హరిగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.బిక్కూలాల్‌లు సహకరించారు.

భర్త దాడిలో తీవ్రంగా గాయపడ్డ భార్య

నేలకొండపల్లి, ఫిబ్రవరి7: రోకలిబండతో భర్త, భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన మండల పరిధిలోని కట్టుకాచారం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం కట్టుకాచారం గ్రామానికి చెందిన తేజావత్ గోపి, నాగజ్యోతి భార్యాభర్తలు. ఇరువురు తరచుగా గొడవలు పడుతుంటారని తెలుస్తున్నది. ఈనేపథ్యంలో బుధవారం మద్యం సేవించి రాత్రి 10.30 సమయంలో ఇంటికి వచ్చిన గోపి భార్యతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో ఉన్న గోపి ఇంట్లోని రోకలిబండతో భార్యపై దాడి చేయగా భార్య తీవ్రంగా గాయపడింది. భార్యకు తీవ్ర గాయాలు గావటంతో గోపి భయపడి పారిపోయాడు. గ్రామస్తులిచ్చిన సమాచారంతో 108 అంబులెన్సులో నాగజ్యోతిని చికిత్స కోసం నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకొచ్చారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

భద్రాచలం, ఫిబ్రవరి 7: పాల్వంచ, భద్రాచలంలలో ఇళ్లల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాల్వంచకు చెందిన బానోతు ప్రశాంత్ అనే వ్యక్తిని బుధవారం భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి అరెస్టు చేశారు. ప్రశాంత్ వద్ద నుంచి అరకిలో వెండి, తులం బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పాల్వంచలోని గట్టాయిగూడెంలో డిసెంబరులో ఓ ఇంటితాళం పగలకొట్టి సుమారు ఒక తులం బంగారం వస్తువులు చోరీ చేశాడు.

మళ్లీ భద్రాచలంలోని వెంకటేశ్వర కాలనీలో రాత్రిపూట మరొక ఇంటిలో అరకిలో వెండి వస్తువులు దొంగతనం చేయగా సీసీ కెమెరాల సహాయంతో భద్రాచలం పోలీసులు గుర్తించి ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ సమయంలో చోరీ చేసిన ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో సైతం ప్రశాంత్ భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచల్లో చోరీలకు పాల్పడి జైలుకెళ్లివచ్చాడని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ప్యాలెస్‌ను పరిశీలించిన పొంగులేటి

కల్లూరు, ఫిబ్రవరి 7: కల్లూరులో పొంగులేటి వారి వి వాహ విందు వేడకలకు భారీసెట్టింగ్‌తో సిద్ధమవ తున్న పీఎస్ఆర్ ప్యాలెస్‌ను బుధవారం రాత్రి రెవెన్యూశా ఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి మాధురి పరిశీలించారు. ఈ నెల 14న తన సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కుమారుడు లోహిత్‌రెడ్డి వివా హం విదేశాల్లో జరగనున్నది. దీంతో పాటుగా ఈ నెల 18న కల్లూరు ఎన్నెస్పీ క్రాస్ వైపున గల సుమారు 40 ఎకరాల స్థలంలో రిసెప్షన్ వేడుకను ఘనంగా నిర్వహిం చేలా ఎంకే అధినేత మల్లిఖార్జున్‌రావు ఆధ్వర్యంలో భారీ సెట్టింగ్‌లతో పీఎస్ఆర్ ప్యాలెస్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మంత్రి పొంగులేటి బుధవారం రాత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం కల్లూరులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు విషయమై మంత్రిని ఎన్టీఆర్ అభిమాన సంఘం తరుపున ప్రముఖ వైద్యుడు పైడిపల్లి రాధకృష్ణమూర్తి తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు మంత్రి సానుకూలం గా స్పందించారు. తన సోదరుడి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహ విందు వేడుకకు కాంగ్రెస్ శ్రేణులు, పొంగులేటి అభిమానులు తరలి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో పొంగులేటి క్యాంపు ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, పోతురాజు కోటయ్య, కాటేపల్లి కిరణ్‌కుమార్, మట్టూరి జనార్ధన్, టీడీపి నాయకులు కట్టా గోపాలరావు, జాస్తి శ్రీనివాసారవు, పొట్రు శ్రీనివాసరావుతో పాటుగా పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

మాతాశిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 7: మారుమూల ప్రాంతాలైన గొత్తికోయ, కొండరెడ్ల గ్రామాల్లో మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు ఖచ్చితంగా స్కానింగ్ చేయాలని ఆదేశించారు. భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, రామవరంలలో నెలకు సుమారుగా 100కు పైగా స్కానింగ్ చేయవలసిందిగా సంబంధిత వైద్యులను ఆదేశించారు. అలాగే మారుమూల ప్రాంతాల్లో 'ఇండిజినేష్ డవలప్‌మెంటు ఆర్గనైజేషన్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ భాగస్వామ్యంతో కలిసి జిల్లా వైద్యశాఖ అధికారులు పని చేయవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ రాజశేఖర్, జిల్లా సంక్షేమాధికారి విజేత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ కపిల్ శర్మ, ఉజ్వల్, భార్గవ్, సంతోష్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

ముదిగొండ, ఫిబ్రవరి 7: ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని దేవాదాయశాఖ ఈవో నారాయణచార్యులు హెచ్చరించారు. ముదిగొండలోని ఆక్రమణకు గురైన శ్రీలక్ష్మీ నర్సింహా, చెన్నకేశవస్వామి ఆలయ భూముల్లో బుధవారం బోర్డులను ఏర్పాటుచేశారు. సువర్ణాపురం రెవెన్యూ సర్వేనెంబర్‌లోగల 308, 309, 310లో 33 ఎకరాల 26కుంటల దేవాలయ భూమి ఆక్రమణకు గురైనట్లు సర్వే అధికారుల బృందంతో గుర్తించారు. దేవాలయ భూమిగా గుర్తించి సదరు భూమికి ఆలయ భూమిగా బోర్డులను ఏర్పాటుచేసి దేవాదాయ భూములు అమ్మినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం చర్యలు ఉం టాయని హెచ్చరించారు. ఆ భూములను ఎవరు కొనుగోలు చేసిన ఆభూమి దేవాదాయ శాఖ భూమిగానే పరిగణలోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ

అశ్వారావుపేట, ఫిబ్రవరి, 7: ఆసుపాక గ్రామంలో ఈనెల 2న కోల వీరభద్రం హత్య కేసులో నిందితులను అశ్వారావుపేటలో అరెస్టు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ హత్య వివరాలను వెల్లడించారు. కోలా వీరభద్రం, రాములమ్మ భార్యభర్తలు అశ్వారావుపేటలో జీవనం సాగిస్తున్నారు. వీరభద్రం మద్యానికి బానిసై తరుచు రాములమ్మను వేధింపులకు గురిచేయటం తరచూ ఘర్షణ జరిగేది. ఈక్రమంలో 15 రోజుల క్రితం భర్తతో గోడపడి రాములమ్మ ఆసుపాకలో ఉంటున్న కుమార్తె విజలక్ష్మి వద్దకు వెళ్ళింది. కాగా ఈనెల 2న వీరభద్రం కుమార్తె ఇంటికి వెళ్లి భార్య రాములమ్మతో గొడవ పడ్డాడు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీన్ని సహించలేని భార్య రాములమ్మ, కుమారుడు నరేష్ కుమార్తె విజయలక్ష్మి ముగ్గురు కలలిసి తండ్రి వీరభద్రంపై కర్రలతో దాడి చేయగా త్రీవంగా గాయపడ్డాడు. అపస్మార స్థితికి వెళ్లటంతో బయపడిన ముగ్గురు వీరభద్రాన్ని కారులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. బయడిన వీరు మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించారు. ఈ సమాచారం తెలుసుకున్న బంధువులు మృతదేహాన్ని అప్పగించకుంటే కేసు పెడతామని బెదిరించటంతో బంధువులకు అప్పగించకుండ మృత దేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాల వద్ద వదిలి పారిపోయారు. ఈవిషయం తెలుసుకున్న బందువులు హత్య ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి నింధితులు రాములమ్మ, నరేష్, విజలక్ష్మిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కర్రలను, మృతదేహాన్ని మాయం చేసేందుకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకరణ్

సింగరేణి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలి

సత్తుపల్లి, ఫిబ్రవరి 7: సింగరేణి సంస్థలోని ఉద్యోగు లంతా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ నిర్ధేశించిన లక్ష్యాన్ని సాధించాలని మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సభ్యులు కోరారు. బుధవారం మండలంలోని కిష్టారం ఓసీ వద్ద 11ఏరియాలలోని మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కిష్టారం ఓసీకి ఎటువంటి యాక్సిడెంట్ లేకుండా 83రోజుల ముందుగానే ఉత్పత్తి సాధించి సంస్థలోనే మొదటి స్థానంలో నిలిచిం దన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా సాధిం చాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవీ.కోటిరెడ్డి, ఏజీఎం కే.హనుమలత, డీజీఎం ఎస్.యోహాన్, పర్సనల్ మేనేజర్ బీ.శివకేశవరావు, కిష్టారం ఓసీ పీవో ఎంవీ. నరసింహారావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ టీ.రమణారావు, మేనేజర్ బీ.రామకృష్ణ, రక్షణా .దికారి గోపీ కిషోర్, సంక్షేమాధికారి వీ.సందీప్, ఇతర ఉద్యోగులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ఇన్‌స్పైర్‌లో దమ్మపేట విద్యార్థి ప్రతిభ

దమ్మపేట, ఫిబ్రవరి 7: దమ్మపేట జడ్పీపాఠశాలో ఇంగ్లీష్ మీడియంలో 10వతరగతి చదువుతున్న రోయ్యల చరణ్ జాతీయస్థాయిలో జరిగిన న్స్పైర్‌లో కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రతిభా ప్రశంశాపత్రం అందుకున్నాడు. హర్యానాలోని పరీభాద్‌లో జనవ రి 17 నుంచి 20 వరకు ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈకార్యక్రంలో చరణ్ పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రముఖ శాస్త్రవేత్తల ప్రశంశలలో ప్రశంశా పత్రాన్ని అందజేయగా కొత్తగూడెం కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఈవో వెంకటాచారి చరణ్‌కు ప్రశంశాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీ, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, పాల్గొన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. .



ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బూర్గంపాడు, ఫిబ్రవరి 7: బూర్గంపాడు మండల పరిదిలోని సోంపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9మంది పేకాట రాయుళ్లని అదుపులోకి తీసుకోగా వారి దగ్గర నుంచి 60,000ల నగదు, 8సెల్‌ఫోన్‌లు స్వాదీనం చేసుకుని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మల్లన్నవాగులో మొసళ్లు

- భయాందోళనలో గ్రామస్థులు

గుండాల, ఫిబ్రవరి 7: వాగులో దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళలకు మొసళ్లు కనిపించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల పరిదిలోని రోళ్లగడ్డ గ్రామ సమీపంలోని మల్లన్నవాగులో పోతురాజు మడుగు, గుండ్ల మడుగులోకి గతంలో కురిసిన భారీ వర్షాలకు రెండు మొసళ్లు చేరాయి. గత వారం రోజులుగా ఒడ్డుకు వచ్చిపోతున్నాయి. దీంతో వాగు నుంచి నీళ్ల కట్టెందుకు వెళ్లే రైతులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మధ్యాహ్నం ఎండ వేడికి మడుగు ఒడ్డుకు చేరి సేదతీరుతున్నాయని గ్రామ స్థులు పేర్కొంటున్నారు. దిగువ ప్రాంతంతో చెక్‌డ్యాం నిర్మించడంతో మడుగులు ఎక్కు వ లోతు ఉన్నాయని, వాగు పరిసరాలలో యాసంగి సాగు చేస్తున్నారు. విద్యుత్ మోట్లార్లు, ఆయిల్ ఇంజన్లుతో సాగు నీరు వాడుతున్నారు. ఈ క్రమంలో మొసళ్లు కనిపించడంతో భయాంధోళనకు గురవుతున్నా రు. చేను పనులకు వెళ్ళేవారు వాగు దాటాల్సి ఉంటుంది. అయితే క్షణంలోనైనా వాటితో ప్రమాధం జరగవచ్చని వాపోతున్నారు. అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. .



వాగు ఒడ్డున ఉన్న మొసలి

తీర్థాల జాతరకు విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థాల ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆలయ భూములను సర్వేచేసి, హద్దులు గుర్తించి, చుట్టూరా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు.

ఇక మహాశివరాత్రి వేళ జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామన్నపేట, కామంచికల్లు మీదుగా తీర్థాలకు వచ్చే రహదారికి మరమ్మతులు చేయాలని, పల్లెగూడెం నుండి మంగళగూడెం రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రహదారి విస్తరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరులో నీళ్ల తక్కువగా ఉన్నాయని, జాతర నాటికి నీళ్ల వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంక్ నిర్మించి ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.



ఆరెకోడుతండా పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మహిళలకు ఉచిత ప్రయాణాన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. తీర్థాల వైపు మున్నేరుకు కరకట్ట నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అదేవిధంగా బ్రిడ్జినుండి గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. కామంచికల్ గ్రామం నుండి తీర్థాల వరకు 125 మీటర్ల రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. జాతరలో పారిశధ్యం, వైద్యం అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

అనంతరం తీర్థాల, గుడిమళ్ల గ్రామాల్లో పల్లె దవాఖానాలను, ఆరెకోడు తండాలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీపీ బెల్లం ఉమ, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, నాయకులు రాయల నాగేశ్వరరావు, చరణ్‌రెడ్డి, వెంకటరెడ్డి, బోడా వెంకన్న, మద్ది వీరారెడ్డి, కన్నేటి వెంకన్న, మద్ది మల్లారెడ్డి, హరినాదబాబు, రఘు, పంతులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణారోగ్యం

▸ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



పారిశుధ్య వారోత్సవాల్లో ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, ఫిబ్రవరి 7: పరిసరాలు పరిశుభ్రతగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవించవచ్చని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం కామేపల్లిలో పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణలో పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రూ.25లక్షలు వ్యయంతో పీహెచ్‌సీ భవన పునర్‌నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కామేపల్లి హరిజన వాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, ఉచిత విద్యుత్ సేవలను ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రముఖ కాంట్రాక్టర్ రామళ్ల రాంమూర్తి రాణి దంపతులు గర్భిణులు, బాలింతలు, పిల్లల కోసం కుర్చీలు, ఫ్యాన్లు అందించడంతో ఎమ్మెల్యే కనకయ్య రాంమూర్తిని శాలువాతో ఘనంగా సత్కరించారు.



ఇంటర్ విద్యార్థులకు

ఇంగ్లీష్ ప్రాక్టికల్స్

▸ ఆంగ్ల భాషా నైపుణ్యాలపై పరీక్ష

▸ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేకం

▸ 20మార్కులకు 7వస్తేనే ఉత్తీర్ణత

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 7: విద్యార్థులకు ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి ఆంగ్లంలో ప్రయోగ పరీక్షను ఈ నెల 16న నిర్వహించనుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులందరూ తప్పకుండా ఈ పరీక్షకు హాజరు కావాలి. మొత్తంగా 80 మార్కులు థియరీకి కేటాయించగా ప్రయోగాలకు 20 కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే పరీక్షలో 20 మార్కులకు కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. గైర్హాజరైన విద్యార్థులను ఫెయిలైనటుగా పరిగణిస్తారు. కాగా ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష కోసం కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన మూడు దశల ప్రాక్టికల్స్‌కు హాజరుకాని వారు కూడా నాలుగో విడతలో హాజరయ్యేందుకు వెసులుబాటు కల్పించారు.

నాలుగు విడతల్లో..

ఖమ్మం జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 1,816 మంది ఉన్నారు. వీరందరికీ ఆంగ్ల ప్రయోగ పరీక్షను పరికరాలతో కాకుండా తరగతి గదిలోనే విద్యార్థుల భాషా సామర్థ్యాల పరిశీలనతో నిర్వహిస్తున్నారు. కమ్యూనికేషన్ ఫంక్షన్ మొదటి దశలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షిస్తున్నారు. రెండో దశలో 'జస్ట్ ఎ మినిట్' పేరిట ఒక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది. మూడో దశ రోల్‌ప్లేలో తల్లిదండ్రులు లేదా మరేదైనా అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి. ఈ నెల 16న నాలుగో దశలో లిజనింగ్ కాంప్రహెన్సివ్ పేరిట గ్రహించే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు. వీటితో పాటు రికార్డు బుక్ ఉంటేనే వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు.

19న పర్యావరణ విద్య..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నైతికత- మానవ విలువలు, పర్యావరణ విద్య పరీక్ష కోసం సన్నద్ధం చేస్తున్నారు. కొత్తగా ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్ పరీక్ష ఉండటంతో రెగ్యులర్ విద్యార్థులకు నైతికత- మానవ విలువలు అనే అంశంపై పరీక్ష నిర్వహించడం లేదు. గతంలో ఫెయిలైన వారికి మాత్రమే ఈ నెల 17న నిర్వహించనున్నారు. ఈ నెల 19న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్ష మాత్రం రెగ్యులర్ విద్యార్థులు కూడా రాయాల్సి ఉంటుంది.

డోర్నకల్, మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలి

▸ లోక్‌సభలో ఎంపీ నామా నాగేశ్వరరావు



ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి7: రైతులకు ఎంతో ఇబ్బందిగా, నష్టదాయకంగా ఉన్న డోర్నకల్- మిర్యాలగూడా రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం లోక్‌సభలో ఈ అంశాన్ని నామా ప్రస్తావించారు. రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో తాను ప్రతిపాదించిన అంశాలను పరిగణలోకి తీసుకున్నారా? అని కేంద్రమంత్రిని ప్రశ్నించారు. సారవంతమైన వ్యవసాయ భూములను కాపాడుకునేందుకు అనేక గ్రామాల రైతులు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతున్నారని నామా పేర్కొన్నారు. ప్రజలకు నష్టం కలిగించే పనులను తాను సహించనని పేర్కొన్నారు. కాగా డోర్నకల్-మిర్యాలగూడా మధ్య 97కి. మీ. మేర నూతనంగా రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే జరుగుతన్నదని, పూర్తి ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) తయారు చేసిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి తెలిపారని ఎంపీ నామా ఒక ప్రకటనలో తెలిపారు.

కులవృత్తిదారుల సంక్షేమానికి విశ్వకర్మ యోజన

▸ జిల్లా పరిశ్రల శాఖ మేనేజర్ అజయ్‌కుమార్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 7: సంప్రదాయ కులవృత్తులను లాభదాయకంగా మార్చడానికి 'ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం' అమలు చేస్తున్నట్లు జిల్లా పరిశ్రల శాఖ మేనేజర్ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, మంగళి, రజక, వడ్డెర, ఔసలి, కంసాలి, దర్జీ వంటి చేతివృత్తులపై ఆధారపడి జీవించేవారంతా ఈ పథకం ఆర్థికసాయానికి అర్హులన్నారు. సీఎస్సీ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడతలో రూ.లక్ష రుణం మంజూరు చేస్తారని, నిర్దిత వ్యవధిలో చెల్లించిన వారికి రూ.2లక్షలు ఇస్తారని తెలిపారు. ఈ సదస్సులో మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డీఎఫ్‌ఓ శివ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె. శివరామ ప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్, ఎల్‌డీఎం శ్రీనివాస రెడ్డి, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ వెంగమ్మ , మునిసిపల్ అధికారి సుజాత పాల్గొన్నారు.

జాతీయ ఖోఖోలో భాను ప్రతిభ



ఆళ్లపల్లి, ఫిబ్రవరి 7: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆళ్లపల్లి మండల గిరిజన విద్యార్థి ఏడూళ్ల భాను ప్రతిభ చూపాడు. ఆళ్లపల్లి మండలం, బోడాయికుంట గ్రామానికి చెందిన భాను తిరుమలాయపాలెంలోని టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. జార్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీలో తెలంగాణ జట్టులో తరఫున పాల్గొన్నాడు. భాను మంచి ఆటతీరు కనబర్చడంతో రాష్ట్ర జట్టు జాతీయస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. కాగా భాను ఖోఖో రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో చురుగ్గా పాయింట్లు సాధించడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. కాగా జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన భానును స్థానికులు అభినందించారు.

ఉత్సాహంగా వ్యవసాయ వర్సిటీ క్రీడలు



వాలీబాల్‌లో తలపడుతున్న జట్లు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 7: అశ్వారావుపేట పట్టణంలోని వ్యవసాయ కళాశాలలో విశ్వవిద్యాలయ స్థాయి అంతర్ కళాశాల క్రీడా పోటీలు బుధవారానికి మూడో రోజుకు చేరాయి. రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి వచ్చిన 430 మంది విద్యార్థులు క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్, ఫుట్‌బాల్, ఖోఖో తదితర పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రీడాలను చూసేందుకు పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ప్రజల పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

సైన్స్ ఒలంపియాడ్‌కు 'హార్వెస్ట్' విద్యార్థి



కృష్ణ మాధుర్‌ను అభినందిస్తున్న రవిమారుత్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 7: 'ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో జిల్లా నుంచి హార్వెస్ట్ విద్యార్థి ఒక్కరే రెండో లెవెల్‌కి ఎంపిక కావడం అభినందనీయమని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం బుధవారం తెలిపింది. జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్ష జనవరిలో మొదటి లెవెల్ పరీక్ష నిర్వహించగా ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో రెండో లెవెల్‌కు 10వ తరగతి విద్యార్థి సీహెచ్ కృష్ణ మాధుర్ ఒక్కరే జిల్లా నుంచి ఎంపికయ్యాడు. బుధవారం హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్ జి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'సీతారామ' లింక్‌కెనాల్ పనులు

▸ రూ. 70కోట్లతో ప్రారంభానికి సన్నాహాలు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి

ఏన్కూరు, ఫిబ్రవరి7: ఏన్కూరు సీతారామ లింక్ కెనాల్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఈఈ, డీఈ, ఏఈలు కెనాల్ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నారు. 8.69మీటర్ల కాలవకు ప్రభుత్వం రూ.70కోట్లు మంజూరుచేసింది. ఈకెనాల్ జూలూరుపాడు సీతారామ మెయిన్‌కెనాల్ నుంచి ఏన్కూరు సమీపంలోని 52.3 కిలోమీటరు వద్ద నాగార్జునసాగర్ ప్రధాన కాలువలో కలుస్తుంది. ఈకాలవ ఏన్కూరు, జూలూరుపాడు మండలాల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సుమారు పదివేల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. ఈకెనాల్ కింద సుమారు 150 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. భూ సేకరణ అనంతరం పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈకాలవ పూర్తయితే వినోభానగర్, హిమామ్‌నగర్, రాజులపాలెం, బద్రతండా, టీఎల్‌పేట, నాచారం, ఏన్కూరు, అక్కినాపురంతండా, భగవాన్‌నాయక్‌తండా గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

వేగంగా భూసేకరణ

సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ భూసేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి బుధవారం ఏన్కూరులో గ్రామ సభ నిర్వహించారు. భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీవో వేణుమాధవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏన్కూరు, నాచారం, టీఎల్‌పేట రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం సహించను

▸ మహాశివరాత్రి నాటికి వైరా నది ఒడ్డున స్నాన ఘట్టాలు

▸ వైరాలో ఇంటర్నేషనల్ స్థాయి విద్యాలయానికి స్థల సేకరణ చేయాలి

▸ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

▸ వైరా మండలంలో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



వైరా నది వద్ద అధికారులకు సూచనలిస్తున్న భట్టి

వైరా, ఫిబ్రవరి 7: అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని, అలసత్వాన్ని సహించేది లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం, గండగలపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. వైరా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి తదితర కార్యక్రమాలపై నీటిపారుదల, పంచాయతీరాజ్, దేవాదాయ ధర్మాదాయ, రెవెన్యూ, పర్యాటక, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో భట్టి విక్రమార్క సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

స్నానాల లక్ష్మీపురంలోని వైరా నది ఒడ్డున నీటిపారుదలశాఖ చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. రూ.4.80 కోట్లతో చెక్‌డ్యాంను నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యంతోపాటు గ్రామానికి, పొలాలకు ఎలాంటి నష్టం లేకుండా రక్షణ గోడలు నిర్మించాలని ఐబీ ఈఈ బాబూరావు, డీఈఈ పి.శ్రీనివాస్‌ను ఆదేశించారు. అలాగే మహాశివరాత్రి నాటికి వైరా నదిలో భక్తుల సౌకర్యం కోసం రూ.85లక్షలతో స్నాన ఘట్టాలు నిర్మించే విషయమై సమీక్షించారు. 20నుంచి 30 స్నానాల గదులు, మహిళలు, పురుషులు దుస్తులు మార్చుకొనేందుకు పది గదులు శివరాత్రి నాటికి నిర్మించాలని ఆదేశించారు.

వైరా కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ కోసం పంపించిన ప్రతిపాదనల గురించి ప్రశ్నించారు. రూ.86.80కోట్లకు ప్రతిపాదనలు పంపించామని అధికారులు తెలపగా ఆధునీకరణ ఎంతవరకు పూర్తవుతుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. శివరాత్రి నాటికి రామలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాలను సుందరీకరణ చేయాలని పర్యాటకశాఖ అధికారి సుమన్ చక్రవర్తి, దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి సమతను ఆదేశించారు.

ఆ తర్వాత గండగలపాడు- స్నానాల లక్ష్మీపురం గ్రామాల మధ్య రూ.2.26కోట్లతో నిర్మిస్తున్న రోడ్ల పనులను పంచాయతీరాజ్ ఎస్‌ఈ రామచంద్రమౌళి, డీఈ వెంకటరెడ్డి, ఏఈ దేవప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. గండగలపాడు నుంచి కాకుండా వైరా నుంచి నేరుగా ఈ రోడ్డు గుండా స్నానాల లక్ష్మీపురం వెళ్లేందుకుగానూ సేకరించాల్సిన భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఎలాంటి వివాదం లేకుండా భూములు సేకరించి రోడ్డు నిర్మాణం చేయాలని తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, పంచాయతీ అధికారులను ఆదేశించారు. భూమిని ఇచ్చేందుకు నిరాకరించేవారికి నచ్చజెప్పాలని, అవసరమైతే తాను, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కూడా మాట్లాడతామని అధికారులకు స్పష్టం చేశారు.

నియోజకవర్గ కేంద్రమైన వైరాలో ఇంటర్నేషనల్ స్థాయి విద్యాలయ నిర్మాణానికి 10నుంచి 15ఎకరాల స్థలాన్ని సేకరించాలని తహసీల్దార్‌ను భట్టి విక్రమార్క ఆదేశించారు. వైరాలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి తాము పరిశీలించిన భూముల గురించి భట్టికి తహసీల్దార్ వివరించారు. తొలగించిన ఆక్రమణ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు కోర్టులో ఉన్న న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైరా మునిసిపాలిటీకి కమిషనర్ పోస్టును మంజూరు చేయించాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కోరగా అవసరమైన అన్ని ప్రతిపాదనలు అందించాలని సూచించారు.

పైన మెరుగు.. నాణ్యత కరువు

▸ నాసిరకంగా మన ఊరు-మనబడి పనులు

▸ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

▸ లోపించిన అధికారుల పర్యవేక్షణ

▸ నేలకొండపల్లి ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టర్ నిర్వాకం



పెచ్చులూడుతున్న స్లాబ్



నాసిరకంగా నిర్మించిన వాటర్ ట్యాంక్



టైల్స్ పగిలిపోయిన నిర్మాణం

నేలకొండపల్లి, ఫిబ్రవరి 7: విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రారంభించిన మన ఊరు-మనబడి పథకం మసకబారుతోంది. కాంట్రాక్టర్ల చేతివాటం, పనుల్లో డొల్లతనం కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. పర్యవేక్షణ లోపంతో పనులన్నీ పగుళ్లిస్తున్నాయి. ఇదేమని ప్రశ్నిస్తే ఇంకా బిల్లులివ్వలేదని అధికారులంటున్నారు. నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అవసరమైన మౌలిక అవసరాలు తీర్చటానికి మనఊరు-మన బడి పథకంలో రూ.35 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ పనుల కాంట్రాక్టును దక్కించుకున్న వ్యక్తి నేలకొండపల్లికి చెందిన మరో వ్యక్తికి సబ్ కాంట్రాక్టుకు ఇచ్చారు. ఆ రెండో వ్యక్తి చేసిన పనుల్లో నాణ్యత లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు కాంట్రాక్టరు ప్రహరి నిర్మాణం ప్రారంభించినా అది పూర్తికాలేదు. ఆ పనుల్లో నాణ్యత లేదనే విమర్శలు ఉన్నాయి.

పనుల్లో కనిపించని నాణ్యత..

పాఠశాలలో విద్యార్థుల అవసరాల కోసం నిర్మించిన మినీ వాటర్ ట్యాంకు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడానికి, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద వేసిన టైల్స్ పూర్తిగా పగిలిపోయాయి. కిచెన్‌షెడ్ స్లాబ్‌కు ఉన్న పాత సిమెంట్‌ను పూర్తిస్థాయిలో తొలగించకుండా ప్లాస్టరింగ్ చేయడంతో వేసిన సిమెంటు పెచ్చులుగా ఊడుతోంది.

పర్యవేక్షణ లోపం..

నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్టరు ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. మండల కేంద్రంలో మన ఊరు-మన బడి పనులే ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాగా సదరు కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయం సైతం ఇంకా ప్రారంభం కాకుండానే బయట, లోన మొత్తం పగుళ్లు రావడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో పనులను పర్యవేక్షించి కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులను తిరిగి చేస్తేనే బిల్లులు

పాఠశాలలో నాసిరకంగా ఉన్న పనులను తిరిగి చేస్తేనే బిల్లులు ఇస్తామని ఏఈఈ దేవేందర్ స్పష్టం చేశారు. పిల్లలు ఆటలాడటంతో టైల్స్ ధ్వంసం అయ్యాయని అన్నారు. ఇప్పటికి రూ.15లక్షలే బిల్లులిచ్చామని, మిగతావి ఇవ్వలేదన్నారు. కాగా అసలు కాంట్రాక్టరు గాకుండా బినామీ కాంట్రాక్టరు పనులు చేస్తున్న విషయం తనకు తెలియదని అన్నారు.

గంజాయి, సారాను నిర్మూలించాలి

▸ ఈఎస్ నాగేంద్రరెడ్డి



మాట్లాడుతున్న నాగేంద్రరెడ్డి

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 7: ఖమ్మం జిల్లాలో నూరుశాతం గంజాయి, నాటు సారాయి నిర్మూలన జరిగి మత్తు ప్రభావం లేని ప్రాంతంగా ప్రకటించే వరకు ఎక్సైజ్‌స్టేషన్ అధికారులు పూర్తిస్థాయిలో పని చేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి ఆదేశించారు. బుధవారం ఈఎస్ కార్యాలయంలో జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్‌ల వారీగా సమీక్షించారు. మత్తు పదార్థాల అమ్మకాల విషయంలో ఎటువంటి పైరవీలను పరిగణించాల్సిన అవసరం లేదన్నారు. ఇక నుంచి ప్రతి రోజు గంజాయి, నాటు సారాయి, మత్తు పదార్థాలను నిర్మూలించటంపై సిబ్బందికి కార్యచరణ చేపట్టాలని ఆయన ఆదేశించారు.

విద్యుత్‌శాఖలో అలజడి

▸ అక్రమంగా ఉద్యోగి నియామకం, జీతాల చెల్లింపుపై విచారణ

▸ అప్పటి డీఈ, ఏడీలను ప్రశ్నించిన ఆడిట్ సీజీఎం

▸ వేదికైన ఖమ్మం ఎస్‌ఈ కార్యాలయం

▸ గోప్యత పాటించిన అధికారులు



విచారణ నిర్వహించిన ఎస్‌ఈ కార్యాలయం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 7: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో తాత్కాలిక సిబ్బందిని తొలగించగా ఖమ్మం జిల్లాలో మాత్రం అమలు కాలేదు. కొంతమంది అధికారులు తమకు అనుకూలంగా ఉండే వ్యక్తికి ఉద్యోగం కల్పించారు. వారే అతనికి ప్రతీ నెలా జీతం చెల్లించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న సదరు వ్యక్తి తననను పర్మినెంట్ చేయాలని పూర్వ సీఎండీ ప్రభాకరరావును కోరారు. దీంతో అసలు ఉద్యోగం ఎవరిచ్చారని ఆయన విచారణకు ఆదేశించారు. ఈమేరకు ఆడిట్ సీజీఎం రవీంద్రనాథ్ ఖమ్మం ఎస్‌ఈ కార్యాలయంలో బుధవారం పూర్తి స్థాయి విచారణ చేపట్టారు.

డీఈ, ఏడీల సొంత నియామకం

2019కు పూర్వం విద్యుత్‌శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న 2,360 మందిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించింది. సర్కారు అనుమతి లేకుండా స్థానికంగా ఏ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వొద్దని ఆదేశించింది. అయితే ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఆ నాటి డీఈతో పాటుగా ఏడీలు కలిసి ఓ వ్యక్తిని తాత్కాలిక ఉద్యోగిగా నియమించుకున్నారు. ప్రతి ఏడాది అగ్రిమెంట్లు ఉమ్మడిగా జీతాలు చెల్లించారు. దీంతో అతను ఓ ప్రభుత్వ ఉద్యోగిగా విద్యుత్‌శాఖలో మారిపోయారు. ఆరు నెలల క్రితం ఖమ్మంలో ఆనాటి సీఎండీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో వినియోగదారుల ఫిర్యాదు దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశంలో తాత్కాలికంగా అధికారులు నియమించిన ఉద్యోగి తనను పర్మినెంట్ చేయాలని కోరటంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో వెంటనే ఉద్యోగిని తొలగించిన అధికారులు బాధ్యుడైన డీఈ అప్పటికే పక్కజిల్లా భద్రాద్రికి వెళ్లడంతో అక్కడ నుంచి నిర్మల్ జిల్లాకు బదిలీ చేశారు.

ఎస్‌ఈ కార్యాలయంలో విచారణ..

తాత్కాలిక ఉద్యోగి నియామకంపై మరోసారి పూర్తిస్థాయి విచారణ కోసం విద్యుత్‌శాఖ ఆడిట్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) రవీంద్రనాథ్ బుధవారం ఖమ్మం ఎస్‌ఈ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఉద్యోగి నియామకం, జీతం చెల్లింపు, పనిచేసిన కాలం, సహకరించిన అధికారులు.. తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నతాధికారులు అన్ని స్థాయిల ఉద్యోగులను ప్రశ్నించడం గమనార్హం. విచారణకు అప్పట్లో ఉద్యోగిని నియమించి, జీతాలు చెల్లించిన డీఈలు, ఏడీఈలు హాజరయ్యారు. కాగా విచారణ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులు గోప్యంగా ఉంచటం ఆశాఖలో చర్చనీయాంశమైంది.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

HOUSE CUM SITE FOR SALE
FOR SALE HOUSE CUM SITE 458 Sq yards. EAST FACE, WEST & NORTH C.C.ROAD SHORT DISTANCE FROM WGL X ROAD. TOWARDS WARANGAL Contact: 9849227252
AJM-130887

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపులడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటీ

స్వదేశాగమనము/ విదేశీయానం,
పుట్టిన రోజు
వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి
లీగల్ నోటీసులు
శ్రద్ధాంజలి
పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం : 9985401672
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

అక్రమంగా మట్టి తోలుతున్న టిప్పర్లు, జేసీబీ సీజ్

నేలకొండపల్లి,ఫిబ్రవరి7: మండల పరిధిలోని రాజేశ్వరపురంలోని శ్రీరాజగోపాలస్వామి దేవాలయ భూముల్లో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను బుధవారం రాత్రి నేలకొండపల్లి పోలీసులు సీజ్ చేసారు. రాజేశ్వరపురం గ్రామంలోన శ్రీరాజగోపాలస్వామి దేవాలయానికి దాదాపు 42 ఎకరాల భూమి ఉంది. భూమి అర్చకుల అధీనంలో ఉంటుంది. భూమిని కౌలుకిస్తూ వచ్చే ఆదాయంపై అర్చకులు జీవనం సాగిస్తుంటారు. భూములను కౌలుకు తీసుకున్న రైతులు మట్టిని నేలకొండపల్లిలోని ఓసూపర్ మార్కెట్ నిర్మాణ స్థలంలోకి తరలిస్తున్నట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న నేలకొండపల్లి దేవాదాయ శాఖ ఈఓ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు బుధవారంరాత్రి మట్టి తవ్వుతున్న భూముల వద్దకు వెళ్లారు. ఆరుటిప్పర్లు, మట్టిని తవ్వటానికి ఉపయోగిస్తున్న జేసీబీని సీజ్ చేసి నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

- జడ్పీ సీఈవో వింజం అప్పారావు
- జిల్లావ్యాప్తంగా పారిశుధ్య పనులపై గ్రామసభలు




మాట్లాడుతున్న జడ్పీ సీఈవో అప్పారావు, కిష్టారంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చింతకాని,ఫిబ్రవరి7: ప్రతీ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమైతుందని సీఈవో వింజం అప్పారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నిగ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహించారు. పల్లెల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందుస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం గ్రామ ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, ఎంపీవో రవీంద్రప్రసాద్, డీటీ వీరభద్రనాయక్, ఏవో పల్లెల నాగయ్య, ఏఈ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోనకల్: పారిశుధ్యం మెరుగుదల కొరకు కృషి చేయాలని తహసీల్దార్ పున్నం చందర్ కోరారు. మండలంలోని ఆళ్లపాడులో బుధవారం పారిశుధ్య పనుల నిర్వహణ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పరుశురాం, కందుల పాపారావు, బుంగా రాములు, తోటకూర వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

కొణిజర్ల: గ్రామాల్లో పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో మహాలక్ష్మి ఆదేశించారు. బుధవారం పారిశుధ్యంపై సంబంధించి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ ఈనెల 14 వరకు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పారిశుధ్యం కార్యక్రమాల్లో డ్రైనేజీ సమస్య, రహదారులు, తాగునీరు తదితర సమస్యలను గుర్తించాలని తెలిపారు. ఆయా గ్రామాలలో జరిగిన గ్రామసభల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: గ్రామాలలో సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు గ్రామాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో, కిష్టారం స్పెషలాఫీసర్ బీ.జయరాం కోరారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో వారం రోజుల పాటు సాగే పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు బుధవారం సమస్యలను గుర్తించుటకై స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో కృష్ణ, ఈజీఎస్ ఏపీవో ఎంబాబు, పంచాయితీ సెక్రటరీ మెద్దల రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు పాదయాత్రలు

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారులు పల్లెల్లో పాదయాత్రలకు దిగారు. గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పరిపాలనలోకి రావటంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలకు ఆదేశాలు కార్యచరణ పంపింది. ఈనెల 7నుంచి 14వరకు ప్రతీ గ్రామ పంచాయతీలో సమస్యలు గుర్తింపునకు అధికారులు పాదయాత్రలు చేయటం ముళ్ల పొదలు, చేత్తను గుర్తించి తొలగించటం, స్థానికంగా ఉన్న పారిశుధ్య సమస్యలను గుర్తించటంపై జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలు పంపారు. దీంతో రాఘునాథపాలెం మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.



జిల్లా ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

వేతనాల కోసం కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఆరోగ్యశ్రీ నిధుల నుంచి సర్దుబాటుకు కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి7: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ బుధవారం విధులు బహిష్కరించారు. కొన్నేళ్లుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని కాంట్రాక్టు కార్మికులు ఆస్పతిలో పనిచేసే స్వీపర్లు, పేషెంట్ కేర్స్, సెక్యూరిటీ గార్డులు బుధవారం విధులను బహిష్కరించి ఆస్పత్రి ఎదుట బైటాయించారు. సీఐటీయూ ఐఎఫ్టీయూ కార్మిక సంఘాల కార్మికుల ఆందోళనకు సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఫలితంగా కార్మికులు వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై చర్యలు వెంటనే తీసుకోవాలన్నారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని జిల్లా ఆస్పత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కలెక్టర్ ఆరోగ్యశ్రీ నిధుల నుంచి కార్మికులకు రెండు నెలల వేతనాలను చెల్లించాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కోటి 50లక్షలను గురువారం నాటికి కార్మికులకు చెల్లించేందుకు ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వై విక్రం, ఎన్.నాగేశ్వరరావు, జిల్లానాయకులు కే.శ్రీను, యూనియన్ నాయకులు విజయమ్మ, వెంకటరమణ, అంబేద్కర్, ఉపేందర్, రాములమ్మ, రాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాతండలో చోరీ

కల్లూరు, ఫిబ్రవరి7: మండలంలోని లక్ష్మాతండాలో రూ.70వేల బంగారం, రూ.25 వేల నగదు చోరీ చేశారు. బాధితుడు బాణోతు భాస్కర్ ఈనెల 4న కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి ఖమ్మం వెళ్లారు. బుధవారం ఇంటి తలుపులు తాళం పగల గొట్టిన విషయాన్ని స్థానికులు గమనించారు. వారికి సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా బీరువాలో గల రూ.70 వేల విలువ గల బంగారం వస్తువులు, రూ.25 వేల నగదును చోరి అయినట్లు తెలుసుకొని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ షాకీర్ కేసు నమోదు చేశారు.

ముగ్గురిపై పెటా కేసు

కల్లూరు,ఫిబ్రవరి7: కల్లూరులో ముగ్గురిపై పెటా కేసు నమోదు చేశారు. కల్లూరులో పోలీసులకు అందిన సమాచారం ప్రకారం వ్యభిచార స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో నిర్వాహకుడు వీఎం బంజరుకు చెందిన గుగులోతు భాస్కర్ అలియాస్ రవితో పాటుగా మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన విటులు గన్నవరపు రమేష్, కాటముడి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. వారిపై పెటా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్‌కె షాకీర్ విలేకరులకు తెలిపారు. వారు ఇద్దరు యువతులతో కలిసి ఉన్నట్లు సమాచారం.

తమ్మినేనికి పలువురి పరామర్శ

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి7: అనారోగ్యానికి గురై హాస్పిటల్లో చికిత్స పొంది తెల్దారుపల్లి గ్రామానికి చేరుకున్న తమ్మినేనిని బుధవారం పలువురు సీపీఎం నాయకులు పరామర్శించారు. తమ్మినేని సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాలని పలువురు ఆకాంక్షించారు. తమ్మినేనిని పరామర్శించిన వారిలో సీపీఎం సీనియర్ నాయకులు మామిండ్ల సంజీవరెడ్డి, చిన్న రామిరెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మీ, జయమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, సిద్ధినేని కోటయ్య, నాయకులు నంద్ర ప్రసాద్, కొమ్ము శ్రీను, ఉరడీ సుదర్శన్‌రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, పి.మోహన్‌రావు, పి.సంగయ్య, నందిగామ కృష్ణ, అద్దంకి తిరుమలయ్య, పల్లె శ్రీనివాసరావు, యామిని ఉపేందర్, గురవయ్య పలువురు మహిళలు ఉన్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి7: ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం బుధవారం మొక్కుబడిగా సాగింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈకార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 40గ్రామపంచాయతీలకు సంబంధించిన ఉపాధిపథకం పనులకు సంబంధించిన వివరాలపై తనిఖీ చేపట్టారు. హరితహారం కింద చేపట్టిన మొక్కల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నట్టు విచారణలో తేలింది. కేవలం ఉపాధి పథకం సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు మినహా వివిధ పార్టీల నాయకులుకాని ఎవరు కూడా హాజరుకాలేదు. ఈకార్యక్రమంలో ఏపీడీ శిరీష, ఎంపీడీవో చుంచు శ్రీనివాస్, ఏపీవో నర్సింహారావు పాల్గొన్నారు.

మల్లు అనంతరాములుకు భట్టి నివాళి

సోదరుడి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క, నందిని దంపతులు

వైరా,ఫిబ్రవరి7: తన పెద్ద సోదరుడు, రాజకీయ మార్గదర్శి అయిన దివంగత పీసీసీ అధ్యక్షుడు మల్లు అనంత రాములుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు నివాళులర్పించారు. వైరా మండలం స్నానాలలక్ష్మీపురం గ్రామంలో బుధవారం మల్లు అనంతరాములు 34వ వర్ధంతిని నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి షెడ్యూల్ సమయానికి గంట ముందే తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం చేరుకున్నారు. భట్టికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. మొదట గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భట్టి, నందిని దంపతులు పూజలు నిర్వహించి ఆలయ అధికారులతో కొద్దిసేపు ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం వైరా నది ఒడ్డున తమ పొలాల్లో ఉన్న అనంతరాములు సమాధి వద్దకు చేరుకొని పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే తమ తల్లిదండ్రులు మాణిక్యం, అఖిలాండం, ఇతర కుటుంబసభ్యులకు సమాధులకు నివాళులర్పించారు. అక్కడే భోజన కార్యక్రమాలు ముగించుకున్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

3న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా మహాసభలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి7: వచ్చేనెల 3,4,5తేదీల్లో ఖమ్మంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఐక్యత మహాసభలు నిర్వహించ తలపెట్టినట్లు ఆసంఘ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని నీలం రామచంద్రయ్య భవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఖమ్మం పెవీలియన్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ, 4,5తేదీలలో భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. ఈ సభలను విజవంతం చేయాలన్నారు.సమావేశంలో ఏ.వెంకన్న, సీవై.పుల్లయ్య, గంటా శ్రీను, బీరెల్లి లాజర్, తాటి రాజు, సున్నం కృష్ణ, అలివేలు, దేవి, వెంకట నరసమ్మలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు ముందస్తు ఓటమి భయం

- బాల్క సుమన్ వ్యాఖ్యలు ఆ పార్టీ దౌర్జన్యానికి నిదర్శనం
- టీపీసీసీ సభ్యుడు జావీద్



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యులు జావీద్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి7: రానున్న లోకసభ ఎన్నికల్లో ముందస్తు ఓటమి భయంతో బీఆర్ఎస్ నాయకులు దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ సభ్యుడు ఎండీ జావీద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జావీద్ మాట్లాడారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే బాల్కసుమన్ దుర్భాషలాడటం బీఆర్ఎస్ దౌర్జన్యానికి నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైన బీఆర్ఎస్ పార్టీ లోకసభ ఎన్నికలను ఎదుర్కోలేక మాట్లాడుతున్నారని ఏద్దేవాచేశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్ ప్రయాణం మహిళల్లో మానసిక శక్తిని నింపిందన్నారు. గృహజ్యోతి, మహలక్ష్మీ పథకాలను రాష్ట్ర క్యాబినేట్ అమోదించటంపై హర్షం వ్యక్తంచేశారు. కార్పొరేటర్‌లు లకావత్ సైదులునాయక్, రఫీదాబేగం, నాయకులు రబ్బానీ, హుస్సేన్, కోటేరు నర్సిరెడ్డి, దేవత్ శంకర్‌నాయక్, గడ్డి కొప్పుల ఆనందరావు, ఏలూరి రవికుమార్, పేరం యశ్వంత్, శ్రీశైలం పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

తల్లాడ: బుధవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి రింగ్‌రోడ్డు సెంటర్లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాయల రాము, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి రమేష్, అడపా అనిల్ చౌదరి, ఎర్రి నర్సింహారావు, తాళ్ల జోసఫ్, తూము వెంకటనారాయణ పాల్గొన్నారు.

పుస్తకాలు, బ్యాడ్జీల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 7: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాల ఆవరణలో జాతీయసేవాపథకం వాలంటీర్లకు తొలిమెట్టు పిల్లలకోసం సంబంధించిన పుస్తకాలు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహమ్మద్ జాకీరుల్లా, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పిల్లలకోసం తొలిమెట్టులో భాగంగా సూపర్ 15 విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతీ శనివారం పాఠశాలలకు వెళ్లి చదువులో వెనుకబడిన విద్యార్థులకు బోధనచేస్తున్నందుకు అభినందించారు. పిల్లలకోసం తొలిమెట్టు పథకాన్ని సక్రమంగా అమలుచేస్తూ ఉత్సాహంగా పాల్గొంటున్న కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ దడిగల శ్రీనివాస్, బి. రవివర్ధన్ అభినందించారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

ముదిగొండ,ఫిబ్రవరి7: బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం బాధ్యుడు నర్సింహారావు సూచించారు. ముదిగొండ మండలం గోకినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పరీక్షలపై దృష్టి సారించాలి

బోనకల్,ఫిబ్రవరి7: పదోతరగతి విద్యార్థులు సబ్జక్టుల వారిగా వెనుకబడిన అంశాలపై దృష్టి సారించాలని జిల్లా ఆకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ సూచించారు. బోనకల్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరు ప్రణాళిక ప్రకారం చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య, హెచ్ఎంలుగోపిచంద్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చింతకాని,ఫిబ్రవరి7: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు అమర్లపూడి అప్పారావు, షేక్ సైదులు, మడిపల్లి యల్లయ్య, పిల్లి బుచ్చయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేసిన ఎస్ఐ

కారేపల్లి, ఫిబ్రవరి7: మండలపరిధిలోని పలుప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎస్ఐ పుష్పల రామారావు సడ్డీ మెటీరియల్ పంపిణీ చేశారు. కస్తూర్బా సౌండేషన్ సహకారంతో ఆయన విశ్వనాధపల్లి, పేరుపల్లి, స్థానిక మోడల్ పాఠశాల, గాంధీనగరం ఆశ్రమపాఠశాలలో మొత్తం 300వందల మందికి అందజేశారు.

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ పంపిణీ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి7: శ్రీసత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు ప్రోటీన్ పౌడర్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. స్వయంగా ప్రోటీన్ పౌడర్‌ను తయారు చేస్తున్నామని చెప్పారు.

పాఠశాల సమయం పాటించాలి

తల్లాడ, ఫిబ్రవరి7: పాఠశాల సమయపాలన పాటించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్ సూచించారు. బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్‌స్థాయి సమావేశం జరిగింది. వివిధ ప్రయోగాలను ఉపాధ్యాయులు విజయవంతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నర్సింహారావు, సెక్రటరీ రఫీక్‌పాషా, హెచ్ఎం పారుపల్లి ప్రసూన్న, ఆర్.జగన్నాథం, చైతన్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

తల్లాడ, ఫిబ్రవరి 7: పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని, మూడు డీఏలను మంజూరు చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల సుబ్బయ్య డిమాండ్ చేశారు. పెన్షనర్స్ భవనంలో మండల అధ్యక్షుడు బాజోజు శేషభూషణం అధ్యక్షతన పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ షేక్.ఇబ్రహీం, కార్యదర్శి ఎం.లక్ష్మయ్య, బీరెడ్డి తిరుపతిరెడ్డి, మల్లీడి కోటేశ్వరరావు, కుంచం రామకృష్ణారావు, పఠాన్ మదార్ ఖాన్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఆవుల నర్సయ్య పాల్గొన్నారు.

12న అప్రంటిస్‌షిప్ మేళా

ఖమ్మం, ఖానాపురంహవేలి ఫిబ్రవరి 7: నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 12న ప్రధానమంత్రి జాతీయ అప్రంటిస్‌షిప్ మేళానిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. హైద్రాబాద్ ఎంఎన్‌సీ కంపెనీలతోపాటు ఖమ్మం జిల్లాలోని లోకల్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

అల్పాహారానికి చేయూత

బోనకల్,ఫిబ్రవరి7: మండలంలోని మోటమర్రి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు బుధవారం మాజీ సర్పంచ్ కేతినేని ఇందు రూ.15వేల నగదును వితరణగా అందజేశారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రహీముద్దీన్, శంకర్, పాషా పాల్గొన్నారు.

మైనారిటి కళాశాల, పాఠశాలల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి7: తెలంగాణ మైనారిటీ గురుకులాల్లో పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 15 వరకు పొడిగించారు. ఈ మేరకు మైనారిటి సంక్షేమ శాఖ అధికారి ఏంఏ మహమూది తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలను సంప్రదించాలని తెలిపారు.

చేతివృత్తిదారులకు విశ్వకర్మ యోజన చేయూత

ఖమ్మంబైపాస్‌రోడ్,ఫిబ్రవరి7: చేతివృత్తిదారులకు చేయూతనిచ్చే పథకం పీఎం విశ్వకర్మ యోజనన అని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ గనాతే అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతివృత్తి చేసే ప్రతీ ఒక్కరూ ఈపథకం ఉపయోగించుకోవాలన్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, దేవకి వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, ఓబీసీమోర్చా జిల్లా అధ్యక్షుడు టేకుమట్ల వీరుగౌడ్, జ్వాల, మంద సరస్వతి, విజయారెడ్డి, ఉపేంఆర్‌గౌడ్, వెంకట్ పాల్గొన్నారు.

సుబాబుల్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అఖిల భారత ప్రగతీశీల రైతు సంఘం

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి7:వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా సుబాబుల్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత ప్రగతీశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శలు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. టన్ను సుబాబుల్‌కు కంపెనీ రూ.9వేలు దర నిర్ణయించగా మధ్య దళారుల కారణంగా టన్నుకు రైతుకు రూ.5వేలనుంచి రూ.7వేల వరకు దక్కుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సుబాబుల్ కొనుగోలు కేంద్రాలపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టిసారించాలని కోరారు. రైతులు దళారులు చేతిలో రైతులు నష్టపోకుండా చూడాలన్నారు.

బెస్ట్ అవైలబుల్‌లో పాఠశాలలు ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

డీడీ కస్తాల సత్యనారాయణ

ఖమ్మంసంక్షేమ విభాగం,ఫిబ్రవరి7: బెస్ట్ ఆవైలబుల్ పథకంలో నూతన పాఠశాలల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని డీడీ కస్తాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవ త్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు దరఖాస్తుకు అర్హతగా ప్రకటించారు. ఈనెల 20వరకుఈనెల 20వ తేది వరకు ఖమ్మం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్, షెడ్యూల్ కులముల అభివృద్దిశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి



నివాళులర్పిస్తున్న మహిళలు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి7: రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను సావిత్రిబాయి పూలే మహిళ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పువ్వాడ ఉదయ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రమాబాయి స్త్రీజాతికి ఆదర్శవంతురాలని పేర్కొన్నారు. ఆమె సేవల ఫలితంగానే అంబేద్కర్ రాజ్యాంగ రచన సంపూర్ణంగా రాయగలిగారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర సఖీ సెంటర్ అడ్మిన్ సరిత, ఇమ్మడి అంజని, పి.రమాదేవి, బానోతు బద్రునాయక్, నరేంద్ర, ఉపేంద్రమ్మ, అనంతలక్ష్మి, సునిత, రమ్య, నాగలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

యూనిటీ ఆఫ్ మాల ఆధ్వర్యంలో

యూనిటీ ఆఫ్‌మాల ఆధ్వర్యంలో నగరంలోని 57వడివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిటీ ఆఫ్ మాల జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు, కొరివి దయానంద్, జమ్మి వీరబాబు, చింత మల్ల సుందర్‌రావు, కొప్పుల రామారావు పాల్గొన్నారు.

ఖమ్మంసంక్షేమవిభాగం: రమాబాయి జయంతి వేడుకలను బుధవారం అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్, నాయకులు రమాబాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

సాదాసీదాగా వేంసూరు మండల సర్వసభ్య సమావేశం

వేంసూరు, ఫిబ్రవరి 7: వేంసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్‌లు లేకపోవడంతో తూతూమంత్రంగా నిర్వహించారు. అధికారులు తమ నివేదికలను చదివి విన్పించారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ ఎం.ఎ.రాజు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు షబ్ ఎ మెరాజ్

ఖమ్మంసాంస్కృతికం ఫిబ్రవరి7: ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే షబ్‌ఎమెరాజ్ పండుగ గురువారం నిర్వహించనున్నారు. మసీదులను అలంకరించటంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. రాత్రంతా జాగారం ఉండి నమాజుల్లో పాల్గొంటారు.

సిరిపురం తాజా మాజీ సర్పంచ్‌కు సన్మానం



మాజీ సర్పంచ్‌ను సన్మానిస్తున్న బొర్రా రాజశేఖర్

వైరా, ఫిబ్రవరి 7: మండలంలోని సిరిపురం పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ మట్టూరి సత్యప్రసనాంబ, మాజీ వార్డుమెంబర్లను బుధవారం సన్మానించారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ ప్రసనాంబ, నాగేశ్వరరావు దంపతులు, మాజీ ఉపసర్పంచ్ బొడ్డు రంగా, వార్డు మెంబర్లను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్,ఎంపీటీసీ మట్టూరి కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర రావు (బుజ్జీ), పంచాయతీ కార్యదర్శి ఎస్.హన్మంతరావు, సిరిపురం, విప్పలమడక మాజీ సర్పంచ్‌లు మచ్చా నర్సింహారావు, పర్చూరి రామారావు, పారుపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండ్రాజుపల్లి కొత్తూరు గ్రామాభివృద్ధిలో సర్పంచ్ సేవలు మరువలేనివని ఏఎంసీ మాజీ చైర్మన్ సూరపునేని రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు తోట వెంకటరావులన్నారు. సర్పంచ్ పదవీకాలం పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నెల్లూరి అనురాధలీలాప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ శివ, తాటికొండ కన్నయ్య, పెద్దిరాజు నర్సయ్య, రాగి వీరబ్రహ్మాచారి, నెల్లూరి వెంకటేశ్వరరావు, సత్యవతి, వీరబాబు, కార్యదర్శి రజిత, సొసైటీ సీఈఓ పరమేశ్వరరావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా మాజా ప్రధాన కార్యదర్శి నెల్లూరి వీరబాబులు పాల్గొన్నారు.